క్లుప్తంగా

కుమార సుబ్రహ్మణ్యేశ్వరునికి అభిషేకాలు


ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు

బిక్కవోలు: మండలంలోని కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం వద్ద మంగళవారం భారీగా అభిషేకాలు నిర్వహించారు. మంగళవారం కావడంతో భారీ ఎత్తున భక్తులు వచ్చారు. అనంతరం స్వామివారి ప్రత్యేక అలంకరణ చేశారు. దేవదాయశాఖ ఆధ్వర్యంలో అన్న సమారధన చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో రామలింగ భాస్కర్, సిబ్బంది ప్రసాద్, రవి, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న హౌసింగ్ డీఈ సత్యనారాయణరెడ్డి

పెదపూడి: మండలంలోని 18 గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని హౌసింగ్ డీఈ కె.సత్యనారాయణ రెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో మంగళవారం ఆయన సమీక్షించారు. గ్రామాల వారీగా ఎన్ని ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయి, ఏ దశలలో ఉన్నాయో తెలుసుకున్నారు. వారం రోజుల్లోగా పూర్తి చేసేలా ఇంజినీరింగ్ అసిస్టెంట్లు కృషి చేయాలన్నారు. డిప్యూటీ ఎంపీడీఓ ఎం.సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ గృహ నిర్మాణ రుణాలపై ప్రజలకు చైతన్యం కలిగించాలన్నారు. లబ్ధిదారులు అందరూ ఇళ్లు నిర్మించుకునేలా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ శ్రీనివాసారావు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు లంక వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

సీతానగరం: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని రాజమహేంద్రవరం రూరల్ ఏపీఈపీ డీసీఎల్ ఈఈ జేపీబీ నటరాజన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 33/11 కేవీ కాటవరం సబ్ స్టేషన్ నుంచి కొత్తగా 11 కేవీ కాటవరం ఫీడర్ లైన్ పనుల వల్ల విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని, దీనితో కాటవరం, జాలిమూడి గ్రామాలకు బుధవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ప్రొటోకాల్ ఉల్లంఘనపై మెమో

పెదపూడి: అనపర్తి మండలం దుప్పలపూడి గ్రామంలో సోమవారం అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారం కిట్ల పంపిణీలో ప్రొటోకాల్ ఉల్లంఘనకు పాల్పడిన ఘటనలో ఐసీడీఎస్ సీడీపీఓ జెస్సీ ఫ్లోరెన్స్ స్పందించారు. ఆమెతో పాటు సూపర్‌వైజర్ నందీశ్వరి మంగళవారం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. జరిగిన సంఘటనపై విచారణ చేపట్టి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా సీడీపీఓ జెస్సికా మాట్లాడుతూ ఈ ఘటనలో ఇన్‌చార్జి సర్పంచ్ వల్లభొట్టి శివపద్మినిని కిట్ల పంపిణీకి ఆహ్వానించలేదన్నారు. ఇక నుంచి ప్రొటోకాల్ ఉల్లంఘనకు పాల్పడరాదంటూ, నిబంధనలు పాటించి కార్యక్రమాలు చేపట్టాలని అంగన్‌వాడీ కార్యకర్తను హెచ్చరించామన్నారు. అలాగే మెమో జారీ చేశామని తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రంలో మజ్జిగ అందజేస్తున్న శ్రీనివాసరావు

కోరుకొండ: కోరుకొండలో మంగళవారం విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ నాయకులు కంబాల శ్రీనివాసరావు చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన పలువురికి మజ్జిగ అందజేశారు. ఆయన మాట్లాడుతూ వేసవిలో మండుతున్న ఎండలకు ఉపశమనంగా చలివేంద్రం ఉపయోగపడుతుందన్నారు. మండలంలో 3 కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో కోరుకొండ ఎంపీటీసీ మాజీ సభ్యుడు చలం, నాయకులు నాగా రమేష్, బత్తిన ఆంజనేయులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

పెదపూడి: ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి వైద్యులు కృషి చేయాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. స్థానిక సీహెచ్‌సీలో మంగళవారం ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో అందిస్తున్న సేవలపై సమీక్షించారు. ప్రజలకు మరింత చేరువలో వైద్యసేవలు అందించాలని వైద్యులకు సూచించారు. ఆస్పత్రికి అవసరమైన సౌకర్యాల ఏర్పాటు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ పి.అనుష, ఎంపీడీఓ కె.నరేంద్రరెడ్డి, తహసీల్దార్ పీవీ సీతాపతిరావు, వైద్యులు పాల్గొన్నారు.

సలహాలివ్వండి బాబూ?

- నిరుపయోగంగా మారిన కమిటీలు
- రేషన్ దుకాణాల్లో తూకాల తేడా
- చోద్యం చూస్తున్న అధికారులు


పెదపూడి తహసీల్దార్ కార్యాలయం

పెదపూడి: రేషన్ దుకాణాల సక్రమ నిర్వహణకు ఏర్పడిన ఆహార సలహా కమిటీలు నిరుపయోగంగా మారాయి. అక్రమాలు జరగకుండా చూడటంతో పాటు నిరుపేదలకు సక్రమంగా రేషన్ అందేలా చూడాల్సిన ఆ కమిటీలు నేడు స్తబ్దుగా తయారయ్యాయి. సంఘాల ఉనికి లేకపోవడంతో పర్యవేక్షించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో తుకాలలో మోసాలు అంతకంతకూ పెరిగిపోతున్నాయి. ప్రతి మూడు నెలలకో సారి మండల స్థాయిలో ఆహార సలహా కమిటీ సభ్యులు సమావేశమై మండల పరిధిలోని రేషన్ షాపుల నిర్వహణపై సమీక్షించేవారు. ప్రస్తుతం అటువంటి పరిస్థితి లేకుండా పోయింది.

ఆహార సలహా కమిటీ సంఘాలకు చైర్మన్‌గా మండల స్థాయిలో తహసీల్దార్, జిల్లా స్థాయిలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ వ్యవహరించేవారు. సభ్యులుగా ఎంపీడీఓ, జెడ్పీటీసీ సభ్యులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులను నామినేట్ చేసేవారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి సభ్యులు సమావేశమై ప్రజలకు సక్రమంగా రేషన్ అందించడానికి తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించేవారు. అయితే నేటి పరిస్థితి చూస్తే అందుకు భిన్నంగా ఉంది. ఆహార సలహా సంఘాలు లేకపోవడంతో అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. నాణ్యతను పట్టించుకునేవారే కరువయ్యారు. రేషన్ షాపులలో తూకాలలో తేడాలు ఉంటున్నాయని పలువురు కార్డుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో లబ్ధిదారులకు ఎండీయూ ఆపరేటర్ల ద్వారా వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి రేషన్ అందించేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ వ్యవస్థ పూర్తిగా గాడి తప్పింది రేషన్ సరుకులు సరఫరా చేసే వాహనాలను కొన్ని చోట్ల నిలిపివేయడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

నియోజకవర్గంలో..

అనపర్తి నియోజకవర్గం పరిధిలో నాలుగు మండలాల్లో 88 షాపులు ఉన్నాయి. 90,576 రేషన్ కార్డులు ఉన్నాయి. మండలాల వారీగా వాటి వివరాలు ఇలా ఉన్నాయి.

మండలం	కార్డులు	దుకాణాలు
అనపర్తి	23,175	44
బిక్కవోలు	23,146	40
పెదపూడి	23,932	42
రంగంపేట	20,323	42

పర్యవేక్షణ లేదు



గతంలో ఆహార సంఘాలు ఏర్పాటు చేసి, సమావేశాలు నిర్వహించేవారు. రేషన్ సరుకుల పంపిణీపై పర్యవేక్షణ ఉండేది. రేషన్ షాపులలో వచ్చే లోటుపాట్లపై ఎప్పటికప్పుడు పర్యవేక్షించి పరిష్కరించేరు. ప్రస్తుతం కమిటీల ఉనికి లేకపోవడంతో నిత్యావసర సరుకుల పంపిణీ అస్తవ్యస్తంగా మారింది.

– సాంబత్తుల చంటి, కాండ్రేగుల

త్వరలో సంఘాలను నియమిస్తాం

చౌకధరల ఆహార సలహా సంఘాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నుంచి ఇంకా ఆదేశాలు రాలేదు. ఆదేశాలు వస్తే ప్రతి చౌకధరల దుకాణం పరిధిలో త్వరలోనే సంఘాలను ఏర్పాటు చేస్తాం.

– పీవీ సీతాపతిరావు, తహసీల్దార్ పెదపూడి మండలం

రూ. కోట్లలో కుట్టుశిక్షణ స్కామ్

- వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కొండపల్లి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న దుర్గారావు

కోరుకొండ: కుట్టు శిక్షణ, మెషీన్ల పంపిణీ ద్వారా రూ.167 కోట్ల కుంభకోణానికి కూటమి ప్రభుత్వం తెరలేపిందని వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు కొండపల్లి దుర్గారావు ఆరోపించారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ మహిళలకు కుట్టు శిక్షణ పేరుతో రూ.257 కోట్లు కాంట్రాక్ట్ ఇచ్చారని, ఈ పథకంలో మెషీన్ కొనుగోలుకు రు.4,300, శిక్షణకు కాంట్రాక్టర్ అవుట్‌సోర్స్‌కు ఇచ్చింది రూ.3 వేలు, లబ్ధిదారుకు శిక్షణకు అయ్యే ఖర్చు రూ.7,300 మొత్తం లక్ష మంది లబ్ధిదారులకు అయ్యే వ్యయం రూ.73 కోట్లు అయితే టెండర్ విలువ రూ.230 కోట్లుంది. ఇందులో రూ.167 కోట్లు స్కామ్ జరుగుతోందన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ వాసంశెట్టి పెద్ద వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పని దినాల లక్ష్యాలను పూర్తి చేయాలి

డ్వామా ఏపీడీ రామ్ ప్రసాద్


ఉపాధి సిబ్బందితో సమీక్షిస్తున్న ఏపీడీ రామ్ ప్రసాద్

సీతానగరం: మండలంలోని ఉపాధి హామీ కూలీల పనిదినాల లక్ష్యాలను తప్పని సరిగా పూర్తి చేయాలని డ్వామా ఏపీడీ రామ్‌ప్రసాద్ సూచించారు. మంగళవారం ముగ్గళ్లలో కాలువ పూడికతీత పనులను ఆయన సందర్శించారు. పనులకు వచ్చిన 106 మంది కూలీలకు సంబంధించిన మస్తర్లను పరిశీలించారు. అనంతరం సీతానగరం ఉపాధి కార్యాలయంలో సిబ్బందితో సమీక్షిస్తూ జాబ్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పించాలన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ వారీగా నిర్దేశించిన పనిదినాల లక్ష్యాలను పూర్తి చేయాలని, సగటు వేతనం రూ.300 వచ్చేలా కొలతల ప్రకారం పని చేయించాలన్నారు. ప్రధానమంత్రి సురక్షా బీమా కట్టించాలని, ఏడాదికి రూ.20 చెల్లిస్తే సరిపోతుందని, 18 ఏళ్ల నుంచి 70 ఏళ్ల లోపు వారు ఈ బీమా తీసుకోవాలన్నారు. దీనితో ప్రమాద భీమా రూ.2 లక్షలు, అంగవైకల్యం ఏర్పడితే రూ.లక్ష అందిస్తారన్నారు. అలాగే జీవనజ్యోతి బీమాకు ఏడాదికి రూ.436 చెల్లించాలని, 18 ఏళ్ల నుంచి 50 ఏళ్లు లోపు వారు ఈ బీమా తీసుకోవచ్చని, దీని ద్వారా ప్రమాద బీమా, సహజ మరణానికి రూ.2 లక్షలు అందించనున్నట్టు తెలిపారు. జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి బీమా చేయించాలన్నారు. దీనికి సంబంధించిన దస్త్రాలు బ్యాంకులకు అందించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ బీవీ సత్యవతి, టెక్నికల్ అసిస్టెంట్లు సింహాద్రి, వీరబాబు, కంప్యూటర్ ఆపరేటర్లు నాగేశ్వరరావు, వెంకట్రావు, ఉపాధిహామి పథకం సిబ్బంది పాల్గొన్నారు.

భవితకు మార్గదర్శకం గ్రంథాలయం


వేసవి విజ్ఞాన తరగతుల్లో పాల్గొన్న విద్యార్థులు


రాజానగరంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

రంగంపేట: విద్యార్థుల ఉజ్వల భవితకు గ్రంథాలయాలు మార్గదర్శకాలని గ్రంథాలయాధికారి ఎస్.రామకోటేశ్వరరావు అన్నారు. మంగళవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణా తరగతులు ఉత్సాహంగా సాగుతున్నాయి. తెలుగు భాష ప్రాముఖ్యత మరియు అక్బర్ బీర్బల్ నీతి కథలను విద్యార్థులకు బోధించారు. ఉపాధ్యాయులు కె. సూరిబాబు గణితంలో లాజిక్కులపై శిక్షణ ఇచ్చారు.

పౌష్టికాహారంపై అవగాహన

రాజానగరం: జిల్లా గ్రంథాలయ సంస్థ ఆదేశాల మేరకు స్థానిక శాఖా గ్రంథాలయంలో పాఠశాల విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థులకు మంగళవారం పౌష్టికాహారంపై 'మేజిక్ బస్సు' అనే స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి నాగదేవి అవగాహన కలిగించారు. పుట్టిన నాటి నుంచి 18 ఏళ్లు వచ్చే వరకు మానసిక, భౌతికపరమైన పెరుగుదలకు తీసుకోవలసిన ఆహార పదార్థాల గురించి వివరించారు. ఇదే సమయంలో మానసిక వికాసానికి ఆటలు ఎలా దోహదపడతాయో వివరించారు. ఆంగ్ల భాషపై పట్టు సాధించడానికి అనుసరించాల్సిన పద్ధతులపై ఉపాధ్యాయిని భాగ్యలక్ష్మి అవగాహన కలిగించారు. లైబ్రేరియన్ కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

పాఠశాలకు స్థల దాతల పేరు


దాతల కుటుంబ సభ్యులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే బత్తుల

రాజానగరం: మండలంలోని శ్రీకృష్ణపట్నం, జెడ్పీ ఉన్నత పాఠశాలకు అవసరమైన స్థలాన్ని విరాళంగా అందజేసిన దాతల పేరు పెట్టేందుకు అధికారులు అనుమతించారు. జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు తగిన మౌలిక వసతులు లేక విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని గతంలో గ్రామంలోని సర్వే నంబరు 301/2లో 2856 చదరపు గజాల స్థలాన్ని మందారపు కుటుంబ సభ్యులు అందజేశారు. అయితే ఇది ఏళ్లు గడుస్తున్నా దాతలు పేరును పాఠశాలకు పెట్టాలనే విజ్ఞాపన కార్యరూపం దాల్చలేదు. ఈ క్రమంలో గత ఎన్నికలలో ఈ విషయమై సర్పంచ్ కిమిడి శ్రీరామ్‌తో కలిసి మందారపు కుటుంబ సభ్యులు చేసిన విజ్ఞప్తిపై ఇచ్చిన హామీని ప్రస్తుత ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ నెరవేర్చారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా, కాకినాడలోని జెడ్పీ సీఈఓను కలుసుకుని, ఈ విషయాన్ని అయన దృష్టికి తీసుకువెళ్లి, దాతల కోరిక కార్యచరణలోకి వచ్చేట్టు అనుమతులు పొందారు. దీనితో శ్రీకృష్ణపట్నంలో జెడ్పీ ఉన్నత పాఠశాల ఇకపై మందారపు రామస్వామి అండ్ బ్రదర్స్ జెడ్పీ ఉన్నత పాఠశాలగా నామాంతరం చెందనుంది. ఈ మేరకు అధికారిక ఉత్తర్వులను ఎమ్మెల్యే బత్తుల దాతల ఇంటికి వెళ్లి అందజేసి, వారి కుటుంబ సభ్యులను సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

ధాన్యం కొనుగోళ్లు పెంచాలి

జేసీ చిన్న రాముడు


బిక్కవోలులో జేసీ చిన్న రాముడుకు వినతిపత్రం అందిస్తున్న రైతులు

బిక్కవోలు: మండలంలోని ధాన్యం కొనుగోళ్లు పెంచాలని జేసీ చిన్న రాముడు రైతులను కోరారు. మంగళవారం బిక్కవోలు తహసీల్దార్ కార్యాలయం వద్దకు వచ్చిన జేసీకి రైతులు కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా జేసీ ధాన్యం కొనుగోలు వివరాలు తెలుసుకున్నారు. అయితే ఇప్పటి వరకు మండలంలోని 13,500 మెట్రిక్ టన్నులు ధాన్యం సీఎంఆర్ ద్వారా కొనుగోలు చేశారు. మరో 17 వేల టన్నుల దళారులు, మిల్లర ద్వారా రైతులు బయట మార్కెట్ విక్రయించారు. ధాన్యం 75 కేజీలు బయట మార్కెట్ రూ.1,650 నుంచి రూ.1,500 కొంటున్నారు. మద్దతు ధర రూ.1,730 ఉండగా, ఆ ధరకు మిల్లర్లు కొనుగోలు చేయడం లేదు. దీంతో రైతులు బుధవారం ఆందోళనకు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో స్థానిక అధికారులు ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వటంతో జేసీ వచ్చి మరో 3 వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. అనంతరం రైస్ మిల్లు యజమానులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డీఎంఓ మాధవరావు, అనపర్తి ఏడీ డీవీ కృష్ణ, తహసీల్దార్ బీఎస్‌వీవీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి


బాల వికాస్ వారోత్సవాల్లో మాట్లాడుతున్న బులుసు వెంకటేశ్వర్లు

రంగంపేట: పిల్లలకు బాల్యం నుంచి మానవతా విలువలు అందించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడానికి సత్యసాయి బాల వికాస్ తరగతులు దోహదపడతాయని సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు బులుసు వెంకటేశ్వర్లు సూచించారు. మండల పరిధిలోని కోటపాడు గ్రామంలో సత్యసాయి బాల వికాస్ వారోత్సవాల సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ సత్యసాయి అందించిన సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింసలనే మానవతా విలువలతో పాటు, సంఘనీతి, పాపభీతి, దైవప్రీతి అలవాటు చేయాల్సిన బాధ్యత గురువులు, తల్లిదండ్రులు తీసుకోవాలని ఆయన కోరారు. సత్యసాయి మాతృమూర్తి ఈశ్వరమ్మ వర్ధంతి, బాల వికాస్ వారోత్సవాల ముగింపు సందర్భంగా వృద్ధులకు గొడుగులు, పాద రక్షకులు పంపిణీ చేశారు. సత్యసాయి జిల్లా విద్యా విభాగ సమన్వయకర్తలు ఎల్.శ్రీనివాసరాజు, ఎం.సాయి నిహారిక, టి.రత్నంశ్రీ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా సుమారు 50 కేంద్రాల్లో గత నెల 30వ తేదీ నుంచి ఈ నెల 6వ తేదీ వరకు వారోత్సవాలు నిర్వహిస్తూ విద్యార్థులకు వేదం, యోగ, నిత్య ప్రార్థనలు, దేశ, దైవ భక్తుల గాథలు, అభినయ గేయాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నేర్పిస్తున్నామన్నారు. రంగంపేట, ఈలకొలను గ్రామాల సత్యసాయి సమాజ సేవా కేంద్రాల్లో బాల వికాస్ విద్యార్థులు బాబా పాదుకలకు, చిత్ర పటానికి సామూహిక పూజలు చేశారు. కార్యక్రమంలో జోనల్ కన్వీనర్ సీహెచ్ త్రిమూర్తులు, సేవా సమితి కన్వీనర్లు ఎం. వీర్రాజు, కేవీ అమర్నాథ్, టి.సుబ్బారావు, సబ్ జోన్ విద్యా విభాగ సమన్వయకర్త కందర్ప భానుమతి, ఆయా బాల వికాస్ గురువులు విద్యార్థులు పాల్గొన్నారు.

కిశోర బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలి

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పెదలక్ష్మి


సమావేశంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పెదలక్ష్మి

సీతానగరం: కిశోర బాలికలు మంచి పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.పెదలక్ష్మి సూచించారు. మంగళవారం చినకొండేపూడి సచివాలయం–1 లో కిశోరి వికాసం వేసవి సెలవుల శిక్షణలో ఏడు అంగన్‌వాడీ కేంద్రాల కిషోర బాలికలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పెదలక్ష్మి మాట్లాడుతూ కిశోర బాలికలకు రుతుక్రమం పరిశుభ్రత, శారీరక పరిశుభ్రతలపై అవగాహన కల్పించారు. అలాగే బాల్య వివాహాల వలన కలిగే దుష్ప్రభావాలు, కౌమార దశలు, రక్త హీనత రాకుండా తీసుకోవలసిన పౌష్టికాహారంపై వివరించారు. అలాగే సెల్‌ఫోన్‌లకు అలవాటు పడవద్దని, సైబర్ నేరాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సచివాలయం మహిళా పోలీసు ఉదయ్, ఏఎన్ఎం విశాల, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎన్.సుభాషిణి, రాణి, మంగాకుమారి, సునీత, ధనలక్ష్మి, శాంతి కుమారి తదితరులు పాల్గొన్నారు.

బూరుగుపూడిలో పోలీసు పికెట్


బూరుగుపూడిలో సిబ్బందికి సూచనలిస్తున్న నార్త్‌జోన్ డీఎస్పీ శ్రీకాంత్, సీఐ సత్యకిశోర్

కోరుకొండ: మండలంలోని బూరుగుపూడిలో మంగళవారం పోలీసు పికెట్, 144 సెక్షన్ విధించారు. సోమవారం రాత్రి దళితయువకుడి అరెస్టు, పోలీసులు దురుసుగా ప్రవర్తించారన్న ఆరోపణతో ఆందోళనకు దిగిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో పోలీసుల పట్ల దురుసుగా వ్యవహరించాడన్న కారణంతో స్థానిక చోడదాసి పాల్ ఫ్రాన్సిస్ (టింకూ)ను అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం మంగళవారం కోర్టులో హాజరుపర్చారు. అలాగే గ్రామంలో ముందస్తు చర్యల్లో భాగంగా ఇద్దరు డీఎస్పీలు, నలుగురు సీఐలు, ఐదుగురు ఎస్సైలతో పాటు, 50 మంది పోలీసులు పికెట్ నిర్వహిస్తున్నారు. ఈ ఘటనపై సీఐ సత్యకిశోర్ విలేకరులతో మాట్లాడారు. టింకూ, అతని అనుయాయులు సోమవారం రాత్రి పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొని, మద్యంషాపులో మద్యం సేవించారు. రోడ్డుపైకి వచ్చి అటుగా వస్తున్న సాలాపు చక్రవర్తి ట్రాక్టర్‌ను ఆపారు. డ్రైవర్ తెల్సినవాడు కావడంతో ఇంజన్ ఆపకుండానే తాళం తీసేయడంతో రహదారిపై వాహనాలు నిలిచిపోయాయి. ఎయిర్‌పోర్టు రోడ్డులో వాహనాలు నిలిచిపోవడంతో ఎస్సై నాగరాజు ఆధ్వర్యంలో సిబ్బంది నివారించడానికి వెళ్లారు. పోలీసుల పట్ల టింకూతో పాటు పలువురు దురుసుగా ప్రవర్తించారన్నారు. దీంతో సోమవారం రాత్రి నిందితుడిని అరెస్టు చేశామన్నారు. దీంతో రోడ్డుపై ఆందోళనకు దిగిన యువకులను చెదరగొట్టడానికి విస్తృతంగా పోలీసులను తీసుకువచ్చినట్టు తెలిపారు. గతంలో కొన్ని కేసుల్లో టింకూ ముద్దాయిగా ఉండటంతో ఈ ఘటనలో కేసు నమోదు చేసినట్టు తెలిపారు. టింకూ ప్రథమ నిందితుడని, అతనితో పాటు అరుణ్, ప్రవీణ్, బేదంపూడి చిట్టి, మరి కొందరిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేయనున్నట్టు తెలిపారు.

మాజీ ఎమ్మెల్యేని కలిసిన విజయసారథి


మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డికి సంఘీభావం తెలియజేస్తున్న విజయసారథి

పెదపూడి: అనపర్తిలో వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిని జిల్లా క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు రెవరెండ్ విజయసారధి, ఇతర జిల్లా, నియోజకవర్గ క్రైస్తవ నాయకులు మంగళవారం మర్యాపూర్వకంగా కలిసి సంఘీభావం తెలియజేశారు. ఇటీవల నియోజకవర్గంలో జరిగిన కూటమి ప్రభుత్వ కక్ష సాధింపు చర్యల గురించి, క్రైస్తవులు పడుతున్న కష్టాల గురించి, నియోజకవర్గంలో పార్టీ బలోపేతం చేయడంతో భవిష్యత్ కార్యచరణపై చర్చించినట్టు తెలిపారు. జిల్లా అధ్యక్షుడితో పాటు క్రైస్తవ నాయకులు రెవరెండ్ జి.అమృతరావు, దాడి నాగేశ్వరరావు తదితరులు కలిసిన వారిలో ఉన్నారు.

ఉపాధి పనుల పరిశీలన


రఘుదేవపురంలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ భారతి

సీతానగరం: మండలంలోని రఘుదేవపురంలో జరుగుతున్న ఉపాధి పనులను ఎంపీడీఓ ఎం.భారతి పరిశీలించారు. మంగళవారం రఘుదేవపురంలో జరుగుతున్న పనులను పరిశీలించి, కూలీలకు పలు సూచనలు ఇచ్చారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరు ఉపాధి పనులకు తప్పనిసరిగా హాజరవ్వాలన్నారు. ప్రధానమంత్రి సురక్ష, జీవనజ్యోతి పాలసీలు చేయించుకోవాలని సూచించారు. ఎండ తీవ్రతను తట్టుకునేలా తాగునీరు, ఓఆర్ఎస్ తీసుకోవాలని కూలీలకు తెలిపారు. ఈ శ్రమ్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ బీవీ సత్యవతి, టెక్నికల్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.


పందలపాక కూలీల మస్టర్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాస్

బిక్కవోలు: మండలంలోని పందలపాక గ్రామంలోని జరుగుతున్న జాతీయ ఉపాధి పనుల మస్టర్లను ఎంపీడీవో శ్రీనివాస్ పరిశీలించారు. మంగళవారం కూలీలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పనుల్లో ఎలాంటి ఇబ్బందులు లేవని కూలీలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని రూ.11 లక్షలు విలువైన 9 పనులను 309 మంది పని చేస్తున్నారన్నారు. కేంద్రం ప్రభుత్వం అందించే బీమాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో అగస్టీన్ కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్ కె.అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

తల్లీకొడుకుల అదృశ్యం



వల్లు సత్యవతి, ప్రభాస్ (ఫైల్)

రాజమహేంద్రవరం రూరల్: తన నాలుగేళ్ల కుమారుడితో ఇంటి నుంచి వెళ్లిన తన భార్య ఇప్పటి వరకు తిరిగి రాలేదని కవలగొయ్యికి చెందిన వల్లు పృథ్వీరాజ్ మంగళవారం బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం కవలగొయ్యి గ్రామానికి చెందిన వల్లు పృథ్వీరాజ్‌కు 27 ఏళ్ల భార్య వల్లు సత్యవతి, నాలుగేళ్ల కుమారుడు వల్లు ప్రభాస్ ఉన్నారు. ఏప్రిల్ 30వ తేదీన ఒక ప్రైవేటు స్కూల్లో ఉద్యోగానికి ఇంటర్వ్యూకు వెళ్లింది. అయితే ఆరోజు కాకుండా ఈ నెల ఒకటో తేదీన ఇంటికి వచ్చింది. దీంతో సత్యవతిని అతని భర్త పృథ్వీరాజ్ మందలించాడు. ఈ నెల ఐదో తేదీ ఉదయం ఉదయం 8.30 గంటల సమయంలో తన కుమారుడిని తీసుకుని ఆమె ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదని పృథ్వీరాజ్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు బొమ్మూరు ఎస్సై అంకారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఖైదీలకు న్యాయ సహకారానికి కృషి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): స్థానిక మహిళా ప్రత్యేక కారాగారంలోని ఖైదీలకు న్యాయ సహకారం అందించేందుకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కృషి చేస్తోందని సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎన్.శ్రీలక్ష్మి తెలిపారు. మహిళా ప్రత్యేక కారాగారాన్ని మంగళవారం ఆమె సందర్శించి ఆహారం ప్రమాణాలు, సదుపాయాల కల్పన తదితర అంశాలను పరిశీలించారు. ఖైదీలతో స్థానిక పరిస్థితులను అడిగి తెలుసుకొన్నారు. ఖైదీలు తరపున వాదించేందుకు న్యాయవాదులు కావాలన్నా, బెయిల్ పిటిషన్లు, హైకోర్టు అప్పీళ్ళు తదితర న్యాయ సహకారం పొందేందుకు సంస్థ సహకరిస్తోందన్నారు.పారా లీగల్ వలంటీర్ల ద్వారా లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సేవలను వినియోగించుకోవచ్చన్నారు. మేడే వారోత్సవాల్లో భాగంగా కార్మిక శాఖ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఆనాల వెంకట అప్పారావు రోడ్డు వద్దగల బ్లింకిట్ సంస్థ వర్కర్స్‌తో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ–శ్రమ్ కార్డుల రిజిస్ట్రేషన్ పద్ధతిపై అవగాహన కల్పించారు. జడ్జి శ్రీలక్ష్మి గౌతమి జీవ కారుణ్య సంఘం వృద్ధాశ్రమాన్ని సందర్శించారు.